క్లుప్తంగా

రహదారికి మరమ్మతులు



తాత్కాలిక మరమ్మతులు చేయించిన రహదారిని చూపుతున్న సర్పంచు

పాములపాడు: మండలంలోని పాములపాడు – చెలిమిల్ల గ్రామాల మధ్య రహదారికి మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో ఈనెల 22న రహదారి ఛిద్రం శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి సర్పంచు కోట్ల చంద్రారెడ్డి స్పందించి మట్టి, బిలుకుతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు ప్రభుత్వం నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

కుమారస్వామికి విశేషపూజలు



పూజలందుకున్న స్వామి వారు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో కృతికా నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, అష్టోరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

కంప్యూటర్ల అందజేత



జూపాడుబంగ్లా: మండలంలోని కనకయ్య కొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థులు మంగళవారం రూ.40 వేల విలువైన కంప్యూటర్లను అందజేశారు. పూర్వవిద్యార్థులు కాశిబోయిన వెంకట అశోక్‌కుమార్ తదితరులు హెచ్‌ఎం వెంకటేశ్వర్లును కలిసి కంప్యూటర్లు అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



పిచికారీ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది. చిత్రంలో బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మేరి స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని ఆదేశించారు. కేజీబీవీ 7వ తరగతి విద్యార్థిని డెంగీ లక్షణాలతో కర్నూలులో చికిత్స పొందుతోంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపీడీఓ మంగళవారం కేజీబీవీని సందర్శించారు. పరిసరాలను పరిశీలించి శుభ్రతపై సూచనలిచ్చారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. నీటిని క్లోరినేషన్ చేయించారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రిన్సిపాల్ కృష్ణబాయికి సూచించారు. ఎంపీడీఓ వెంట సర్పంచు లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా దసరా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

నందికొట్కూరు: దసరా పండుగ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జమ్మి చెట్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఏటా దసరా పండుగ రోజు జమ్మికి వచ్చే భక్తులకు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నవరాత్రులను దృష్టిలో ఉంచుకుని జమ్మి చెట్టు వద్ద విద్యుద్దీపాలంకరణ చేయిస్తామన్నారు. ఆయన వెంట కమిషనర్ బేబి, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

కమ్యూనిస్టుల ఆశయాలు కొనసాగిద్దాం



కమ్యూనిస్టుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: ప్రజల పక్షాన పోరాటం చేసి ప్రాణాలర్పించిన కమ్యూనిస్టులు పైలా చంద్రమ్మ, ఎస్‌కే ముక్తార్ పాషా ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నరసింహులు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కమ్యూనిస్టుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాలు, శివ, రామకృష్ణ, లక్ష్మన్న, అబ్దుల్లా, సురేంద్ర, మధు పాల్గొన్నారు.

వ్యాపారుల చేతుల్లో రైతన్న దగా

- రోజు రోజుకు తగ్గిస్తున్న గిట్టుబాటు ధర
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నదాత డిమాండ్

రైతన్నలను వ్యాపారులు దగా చేస్తున్నారు. దిగుబడుల ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండటతో అన్నదాతలు ఆవేదనకు చెందుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాట ధర రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. ప్రభుత్వమే కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. – జూపాడుబంగ్లా



మొక్కజొన్న దాన్యాన్ని ఆరబెట్టుకొని, నూర్పిడి చేసుకొంటున్న రైతులు



దాన్యాన్ని కాటావేస్తున్న హమాలీలు

నిన్నమొన్నటి వరకు మొక్క జొన్న క్వింటాల్ రూ.3,100 పలికింది. రైతులు సాగు చేసిన దిగుబడులు చేతికందగానే ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం క్వింటాల్ మొక్కజొన్న ధర రూ.2,300 ఉంది. క్వింటానికి దాదాపు రూ.700 తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైన జూన్ మొదటి వారంలో ఆశించిన వర్షాలు కురవటంతో రైతులు విరివిగా మొక్కజొన్న సాగుచేశారు. కొందరు రైతులు ఎకరా రూ.20 వేల చొప్పున కౌలుకు తీసుకుని సాగు చేశారు. ఇక పెట్టుబడులు నిమిత్తం ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేశారు. పైర్లు ఏపుగా పెరిగడం, కంకులు బాగా రావడం చూసి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని, దీనికి తోడు మార్కెట్లో ధర కూడా బాగా ఉందని రైతులు సంబర పడ్డారు. కానీ పంట చేతికందే దశలో వర్షం ముంచింది. మరోవైపు కోత కోసి కుప్ప నూర్చుకుని ఎకరాకు 15 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడులు దక్కించుకున్న రైతుల ఆశలపై వ్యాపారులు నీళ్ల చల్లుతున్నారు. వ్యాపారులు కుమ్మక్కై ధరను అమాంతం తగ్గించేశారు. క్వింటా రూ.2,300 అడుగుతుండటంతో గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు మూడునాలుగు రోజుల్లో ధర మరింత తగ్గుతుందని వ్యాపారులు భయపెడుతుండటంతో అమ్ముకోవాలో.. ఉంచుకోవాలో తెలియక రైతులు తర్జనభర్జన పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని విన్నవించుకుంటున్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

నాలుగు ఎకరాల సొంత పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశాను. ఎకరాకు కౌలు రూ.22 వేలు, పెట్టుబడి రూ.25వేల చొప్పున రూ.45 ఖర్చు వచ్చింది. పంట చేతికందే సమయంలో అధికవర్షాల వల్ల కాస్త దెబ్బతింది. పంట నూర్పిడి చేయగా 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వారం క్రితం క్వింటం మొక్కజొన్నల ధర రూ.3,100 ఉండగా ఇప్పుడు వ్యాపారులు రూ.2,300లకు అడుగుతున్నారు. ఈ ధరకు అమ్ముకుంటే పెట్టుబడి కూడా చేతికందదు. – సలాంబాషా, రైతు, తాటిపాడు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి

వ్యాపారులు కుమ్మక్కై మొక్కజొన్న ధరలను తగ్గిస్తున్నారు. దీనికితోడు అధిక వర్షాల పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది. పక్షం రోజుల క్రితం క్వింటం మొక్కజొన్నల ధర రూ.3,100లు ఉండగా ఇప్పుడు రూ.2,300లకు తగ్గించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– వెంకటేశ్వర్లు, రైతు, తాటిపాడు

ధర తక్కువ ఉంటే కొనుగోలు కేంద్రాలకు రెఫర్‌చేస్తాం



ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు రూ.2,225ల మద్దతు ధర ప్రకటించింది. బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ ధర ఉంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. ప్రస్తుతం రూ.2,300ల ధర ఉన్నట్లు తెలుస్తోంది. మరింత ధర తగ్గినట్లయితే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తాం. – కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

పాములపాడు: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాల మహానాడు జిల్లా నాయకులు అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షానికి దెబ్బతినిందన్నారు. ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని, ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

27న ఉచిత కంటి వైద్య శిబిరం

వెలుగోడు: ఈనెల 27న స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు రైతు సంఘం నాయకులు రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కర్నూలు భరత్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహానంది ఎంపీడీఓగా దౌలా

మహానంది: స్థానిక ఎంపీడీఓగా మహబూబ్ దౌలాను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎంపీడీఓల బదిలీల్లో భాగంగా చాగలమర్రి ఎంపీడీఓను మహానందికి కేటాయించారు. కాగా ఇక్కడి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఇకపై ఏఓగా కొనసాగనున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బండిఆత్మకూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎస్‌ఐ జగన్మోహన్ మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఓటీపీ, ఈకేవైసీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

పురుగు మందు వాడకంతో ఆహారం కలుషితం



మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కొత్తపల్లి: పైర్లకు పురుగు మందులు విపరీతంగా వాడటంతో ఆహారం కలుషితమవుతోందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమలత ఆందోళన వ్యక్తం చేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం సమీపంలోని మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేయించాలన్నారు. పట్టు పరిశ్రమ ద్వారా సబ్సిడీలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.మహేష్, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచు లక్ష్మీదేవి, పశువైద్యాధికారి భువనేశ్వరి, సెరికల్చర్ అధికారి లింగమూర్తి, మాజీ సర్పంచు నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులు వాడాలి

బండిఆత్మకూరు: భూసార పరీక్షల ఫలితాలను బట్టి పొలానికి ఎరువులు వాడాలని ఏడీఏ సరళమ్మ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె ఈర్నపాడు, ఏ.కోడూరు గ్రామాల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వరి పైర్లకు బ్యాక్టీరియా రాకుండా కార్బండిజం, మాంకోజెబ్ మందులను వాడాలన్నారు. పచ్చిరొట్ట పైర్లు పెంచడం వల్ల భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వాడితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పొలం గట్లపై కంది, బంతిపూలు, బెండ వేసుకోవడంతో పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చంద్రశేఖర్ రెడ్డి, స్వాతి, వెటర్నరీ డాక్టర్ గౌసియా పాల్గొన్నారు.

■ ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడీఏ ఆంజనేయ మాట్లాడుతూ మొక్కజొన్న, మినుము, మిరప పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. స్ప్రింక్లర్లు, డ్రిప్, పైపులు సబ్సిడీ కింద ఉన్నాయని, కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్‌ఏఆర్‌ఎస్ సైంటిస్ట్ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

■ పాములపాడు: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి రైతులకు సూచించారు. లింగాల, వేంపెంట గ్రామాల పరిధిలోని పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పట్టు వ్యవసాయ అధికారి ప్రసాదరావు, కమలాబాషా, వీహెచ్‌ఏ విజయ్, ఎంపీఈఓ సునీత పాల్గొన్నారు.

■ మహానంది: మండల పరిధిలోని గాజులపల్లె, బసవాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారి రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

■ వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామ పరిధిలోని పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ పవన్ కుమార్ మొక్కజొన్న పంటను పరిశీలించి మొక్కజొన్నలో కత్తెర, లద్దె పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి పాల్గొన్నారు.

■ మిడుతూరు: మండల పరిధిలోని అలగనూరు, రోళ్లపాడు గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ, పత్తి, మిరప పంటల్లో ఆశించిన చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ రామకృష్ణారావు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ పీరునాయక్ పాల్గొన్నారు.

■ జూపాడుబంగ్లా: మండలంలోని పోతులపాడు, 80బన్నూరు గ్రామాల్లో ఏఓ కృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతుసేవాకేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నుంచి ఇతర దేవస్థానాలకు బదిలీ అయిన పలువురు ఉద్యోగులను మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిసెటంట్లు, ఇంజినీరింగ్ విభాగం డ్రాఫ్ట్‌మెన్ తదితర 21 మంది ఉద్యోగులను ఈఓ డి.పెద్దిరాజు సన్మానించి, స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ రమణమ్మ, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన భజన



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై జూపాడుబంగ్లాకు చెందిన శంకర మల్లేశ్వరస్వామి భజన మండలి వారి భజన ఆకట్టుకుంది. మహాగణపతిం, లింగాష్టకం, శ్రీశైలవాస, పార్వతి నాథుడా, శ్రీగిరి మల్లయ్య, పాతాళగంగమ్మ, కైలాస వాసుని, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, ఈశా మహేశా, కైలాసగిరివాసా మొదలైన పలు భక్తిగీతాలను, భజన కీర్తనలను శ్రీనివాసరెడ్డి, శ్యాం సుందర్‌రెడ్డి, శేషయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సోమశేఖర్, శంకర్, మద్దయ్య, శివయ్య తదితరులు ఆలపించారు. కార్యక్రమానికి హార్మోనియం మహేశ్వరరెడ్డి, తబలా సహకారాన్ని జి.వి.కుమార్ అందించారు.

తప్పుడు తూకాలతో మోసగిస్తే చర్యలు

జూపాడుబంగ్లా: తప్పుడు తూకాలతో వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిత హెచ్చరించారు. మంగళవారం స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద తూనికల యంత్రాలు, పరికరాలకు సీళ్లు, ముద్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కాటాలకు తూనికలు, కొలతల శాఖ అధికారులతో కచ్చితంగా సీళ్ల వేయించుకుని సర్టిఫికెట్ పొందాలన్నారు. తప్పుడు తూకాలతో మోసం చేస్తున్న వ్యాపారులపై 9553901900 కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. అనంతరం డీలర్ల ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్ల వేయించారు.

ఆత్మకూరులో 32.4 మి.మీ వర్షం



ఆత్మకూరు పట్టణంలో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సోమవారం 12.2 మి.మీ. వర్షం కురవగా.. మంగళవారం 32.4 మి.మీ. వర్షం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బవనాసి, సుద్దవాగులు పొంగిపొర్లుతున్నాయి. ఇప్పటికే సిద్ధాపురం, కరివేన, ఇందిరేశ్వరం, నల్లకాల్వ, కురుకుంద, వడ్ల రామాపురం గ్రామాల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కాగా భారీ వర్షాలకు మొక్కజొన్న, కంది, మినుము పంటలు దెబ్బతిన్నాయి. ఈ యేడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి మే, జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే గరిష్ట స్థాయిలో వర్షాలు కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

■ జూపాడుబంగ్లా: నియోజకవర్గంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. అత్యధికరంగా నందికొట్కూరు మండలంలో 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా మిడుతూరు మండలంలో 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాములపాడు 41.2 ఎం.ఎం, కొత్తపల్లి 34.4ఎం.ఎం, జూపాడుబంగ్లా 22.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

■ పగిడ్యాల: మండలంలో కురిసిన వర్షానికి ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. వాన మొదులు కాగానే ధాన్యం కాపాడుకోవడానికి రైతులు పరుగులు తీశారు.

వీబీఆర్‌కు జలకళ

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 16.32 టీఎంసీల నీటి నిల్వలతో జలకళను సంతరించుకుంది. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 4,800 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నట్లు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 520 క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5,000 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ ప్రధాన రహదారికి దగ్గర ఉండడంతో శ్రీశైలం మహానందికి వెళ్లే యాత్రికులతో సందడి నెలకొంది.

నీటితో కళకళలాడుతున్న వీబీఆర్



గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

మహానంది: గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి, మహానంది మండల స్పెషల్ అధికారి మురళీ కృష్ణ ఆదేశించారు. తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంళవారం హౌసింగ్ ఏఈ వాసుదేవుడు, ఈఓఆర్డీ శివనాగజ్యోతితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలో 1,053 గృహాలు మంజూరు కాగా 697 పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన వాటిని త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పగిడ్యాల: ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ముచ్చుమర్రి స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తిరుపాలు దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారులు, గ్రామ పెద్దలకు సూచించారు. మంగళవారం మండలంలోని పగిడ్యాల, తూర్పు, పడమర ప్రాతకోట, లక్ష్మాపురం, ముచ్చుమర్రి తదితర గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఆలయాల పవిత్రతకు భంగం కలగకుండా అల్లరి మూకల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్.వి.అబూబకర్, అధ్యాపకులు, రామచంద్రుడు, కె.సూర్యనారాయణ, ఎం.జి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



అండర్-17 ఖోఖోలో విన్నర్స్‌గా నిలిచిన బిజనవేముల బాలికలు

నందికొట్కూరు: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని దామగట్ల గ్రామ సర్పంచు మాధవరం సుశీలమ్మ అన్నారు. మంగళవారం దామగట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు సమయం కేటాయించుకోవాలన్నారు. కాగా అండర్-17 ఖోఖోలో బిజినవేముల జెడ్పీ హైస్కూల్ బాలికలు విన్నర్స్‌గా, కొణిదేల జెడ్పీ హైస్కూల్ బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-17 బాలుర వాలీబాల్‌లో నందికొట్కూరు సెయింట్ మేరీస్ హైస్కూల్ క్రీడాకారులు విన్నర్స్‌గా, బ్రాహ్మణకొట్కూరు జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులు రన్నర్స్‌లో నిలిచారు. అండర్-17 షటిల్ బ్యాడ్మింటన్‌లో పట్టణ జెడ్పీ బాలికల హైస్కూల్ బాలికలు విన్నర్స్‌గా, అండర్-14 విభాగంలో బాలికలు యోగా విన్నర్స్‌గా నిలిచారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు దాత డాక్టర్ చంద్రశేఖర్ సహకారంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ వీరన్న, హెచ్‌ఎం అనిత జీవన్, ఆర్గనైజర్ సుంకన్న, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా ఎంపీడీఓగా గోపికృష్ణ

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓగా డి.గోపికృష్ణను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా డీపీఓగా విధులు నిర్వహిస్తున్న ఇక్కడి ఎంపీడీఓ మంజులవాణిని చాగలమర్రి మండలానికి, పాములపాడు ఎంపీడీఓ డి.గోపికృష్ణను జూపాడుబంగ్లాకు నియమించారు.

సివిల్ సప్లయ్ కమిటీ సభ్యుడిగా మహేష్

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సభ్యుడిగా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ మహేష్‌నాయుడు నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

హత్య కేసు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శ్రీశైలం: శ్రీశైలంలోని పాతాళ గంగ పాత మెట్ల మార్గం వద్ద జరిగిన హత్య కేసు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను టూటౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ చంద్రబాబు విలేకరులకు వెల్లడించారు. మార్కాపూర్‌కు చెందిన అశోక్ (50) ఈనెల 21న అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాపట్ల బాలగంగాధర్, కడప మధుసూదన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని సీఐ తెలిపారు. అశోక్‌తోపాటు నిందితులిద్దరూ పాతాళగంగకు వెళ్లే యాత్రికులకు నుదుటిన బొట్లు పెడుతూ జీవనోపాధి పొందేవారు. ముగ్గురూ మద్యం తాగి గొడవ పడటంతో అశోక్ హత్యకు దారి తీసినట్లు విచారణలో వెల్లడైందని సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.